సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలో ఎసిబి దాడులు

- రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో సోదాలు


సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న ఎసిబి అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతిపై వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో శుక్రవారం అవినీతి నిరోధకశాఖ (ఎసిబి) అధికారులు పలు జిల్లాల్లో అకస్మిక తనిఖీలు చేపట్టారు. డాక్యుమెంట్ రైటర్లు, ఏజెంట్లను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రారంభమైన ఈ తనిఖీలు ఇంకా కొనసాగుతున్నాయి. మేడ్చల్‌లో ఎసిబి డిఎస్‌పి శ్రీధర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఎసిబి అధికారులు మేడ్చల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి చేరుకొని తనిఖీ చేశారు. అయితే డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చేసుకునే వారు మాత్రమే ఆఫీసులో ఉండాల్సి ఉండగా పలువురు డాక్యుమెంట్ రైటర్లు, ఏజెంట్లు ఉండటాన్ని అధికారులు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. డాక్యుమెంట్ రైటర్లు, ఏజెంట్ల వద్ద రిజిస్ట్రేషన్ చేసే డాక్యుమెంట్లు మాత్రమే ఉన్నాయని, డబ్బులు దొరకలేదని ఎసిబి డిఎస్‌పి తెలిపారు. ఆ డాక్యుమెంట్ సంబంధించిన వారిని పిలిపించి వారి స్టేట్మెంట్ రికార్డ్ చేస్తామన్నారు. ఎసిబి అధికారుల ఆధీనంలో ఉన్న పది డాక్యుమెంట్ రైటర్లు, ఏజెంట్లను విచారిస్తామని తెలిపారు. నిజామాబాద్ జిల్లా కేంద్రం కవిత కాంప్లెక్స్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సోదాలు నిర్వహించారు.

వనపర్తి జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్టార్ కార్యాలయంలో ఎసిబి డిఎస్‌పి సిహెచ్ బాలకృష్ణ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. అన్ని రకాల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లతోపాటు కార్యాలయ లావాదేవీ రిజిస్టర్‌లను పరిశీలిస్తున్నారు. ఎసిబి అధికారులు సోదాలు నిర్వహించడానికి ముందు డాక్యుమెంట్ రైటర్లను సంప్రదించి డాక్యుమెంటేషన్ చార్జీల వివరాలను సేకరించినట్టు తెలుస్తోంది. తనిఖీలు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. మంచిర్యాల జిల్లాకేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చేపట్టిన ఆకస్మిక తనిఖీలతో ఉద్యోగులంతా ఉలిక్కిపడ్డారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం చుట్టూ ఉన్న డాక్యుమెంట్ రైటర్లు డాక్యుమెంట్లు పక్కనపడేసి, షెట్టర్లకు తాళాలువేసి పరారయ్యారు. అధికారులను చూసి అప్రమత్తమై పారిపోతున్న కొందరు డాక్యుమెంట్ రైటర్లు, కిందిస్థాయి కార్యాలయ సిబ్బందిని అదుపులోకి తీసుకొని విచారించారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు ఈ తనిఖీలు కొనసాగాయి. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఎసిబి డిఎస్‌పి జగదీశ చంద్ర ఆధ్వర్యంలో ఆకస్మాత్తుగా దాడులు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాడుల సమయంలో రికార్డులు, దస్తావేజులు స్వాధీన పరుచుకున్నామన్నారు. తనిఖీల సమయంలో కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌తోపాటు ఆరుగురు సిబ్బంది ఉన్నారని, వీరితో పాటు ఆరుగురు డాక్యుమెంట్ రైటర్లు, మరో ఆరుగురు వారి అసిస్టెంట్లు ఉన్నారని చెప్పారు. కార్యాలయంలో అనధికారికంగా ఉన్న, ఆధారాలు లేని రూ.63,160 నగదును సీజ్ చేసినట్టు చెప్పారు. రిజిస్ట్రేషన్ అయిన 19 దస్తావేజులు క్లయింట్స్‌కు ఇవ్వకపోవడంతో కార్యాలయంలోనే ఉన్నాయన్నారు.

డిసెంబర్ 9న తెలంగాణ రైజింగ్ -2047 పాలసీ డాక్యుమెంట్ ఆవిష్కరణ

- సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేండ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా డిసెంబర్ 9న తెలంగాణ రైజింగ్-2047 పాలసీ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించుకోబోతున్నట్టు ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ -2025 ను నిర్వహించనున్నామని తెలిపారు. డిసెంబర్ 8న ప్రజా ప్రభుత్వం రెండో వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలని ఆదేశించారు. పాలసీలో తెలంగాణ భవిష్యత్‌కు రోడ్‌మ్యాప్‌ను రూపొందించుకోబోతున్నామని, పాలసీ ఆధారంగానే భవిష్యత్ నిర్ణయాలు తీసుకునే వీలుంటుందని చెప్పారు. పాలసీ డాక్యుమెంట్‌తో పెట్టుబడిదారులకు ఒక స్పష్టత వస్తుందని తెలిపారు. శాఖలవారీగా పాలసీలకు సంబంధించి సమ్మిట్లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ నెలాఖరులోగా శాఖల వారీగా పాలసీ డాక్యుమెంట్ సిద్ధం చేయాలని, గ్లోబల్ సమ్మిట్‌కు వివిధ దేశాల ప్రతినిధులను ఆహ్వానించాలి సూచించారు. వివిధ దేశాల ప్రతినిధులు వస్తున్న నేపథ్యంలో సెక్యూరిటీ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.



రెసోనెన్స్ 16 స్కూల్స్ ప్రారంభం

- ముగిసిన "రెసోఫెస్ట్ 2025'

ప్రజాశక్తి - హైదరాబాద్

రెసోనెన్స్ జూనియర్ కాలేజీలు, రెసోనెన్స్ స్కూల్స్ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్ఠాత్మక వార్షిక సాంస్కృతిక మహోత్సవం 'రెసోఫెస్ట్ 2025' వేడుకగా ముగిసింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వి రమణ 16 కొత్త రెసోనెన్స్ స్కూల్స్‌ను లాంచనంగా ప్రారంభించారు. సోషల్ మీడియా అనవసరమైన విషయాలతో నిండి ఉందని, కాస్త జాగ్రత్తగా ఉండాలని విద్యార్థులకు ఎన్‌వి రమణ సూచించారు. ఎప్పుడూ ఇతరులతో పోల్చుకోవద్దన్నారు. ప్రతి వ్యక్తికి తనదైన వ్యక్తిత్వం, తనదైన మేధస్సు ఉంటుందన్నారు. ఒక స్పష్టమైన లక్ష్యం పెట్టుకోవాలన్నారు. ఇష్టంలేని వృత్తిని ఎంచుకోవాల్సిన అవసరం లేదన్నారు. కలలను సాకారం చేసుకోవాలన్నారు. సోషల్ మీడియాలో కనిపించేది చూసి ఆకర్షితులు కావొద్దన్నారు. నిజ జీవితం, సినిమా రెండు పూర్తిగా వేరన్నారు. ఆ కల్పిత ప్రపంచంలో ఇరుక్కోవద్దన్నారు. జీవితం గొప్ప గురువని, అది నేర్పే పాఠాలకు ప్రత్యామ్నాయం లేదన్నారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ వ్యవస్థాపకుడు, చైర్మన్ లావు రతయ్య, శాంత బయోటెక్నిక్స్ వ్యవస్థాపకుడు, చైర్మన్ కెఐ వరప్రసాద్ రెడ్డి, సినీ నటులు సాయి ధరమ్ తేజ్, మాధాపూర్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ రితి రాజ్, రెసోనెన్స్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎండి ఎన్ పూర్ణచంద్రరావు పాల్గొని విద్యార్థులకు విలువైన సూచనలు చేశారు.

జిన్నింగ్ మిల్లర్ల సమస్యలను పరిష్కరించండి

- రైతులకు జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులు ఇబ్బంది కలిగించొద్దు
- వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించిన తుమ్మల

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సిసిఐ నిబంధనలు తమకు నష్టదాయకంగా ఉన్నాయని చెబుతూ జిన్నింగ్ మిల్లర్లు ఈ నెల 17 నుంచి పత్తి కొనుగోళ్లను నిలిపేస్తామని అల్టిమేటం జారీచేసిన నేపథ్యంలో వారి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ కార్యదర్శి, ఉన్నతాధికారులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. కేంద్ర జౌళి శాఖ సూచనల మేరకు రాష్ట్రంలో మరోసారి క్షేత్రస్థాయి పరిశీలన చేసి జిల్లా వారీ సగటు పత్తి దిగుబడిని లెక్కించాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. శుక్రవారం సచివాలయంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి, ఉన్నతాధికారులతో మంత్రి సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ..ఎల్1, ఎల్2 నిబంధనల వల్ల జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులు ఇక్కట్లు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సీసీఐ అధికారులతో మాట్లాడాలని ఆదేశించారు. సిసిఐ తీసుకొచ్చిన తేమశాతం, ఎకరానికి ఏడు క్వింటాళ్ల పరిమితి నిబంధనలు రైతులకు ముందు కాళ్లకు బంధం వేసినట్టుగా ఉన్నాయని విమర్శించారు. ఇప్పుడిప్పుడే ఎండ తీవ్రత పెరిగి, పత్తిలో తేమ శాతం తక్కువ అవుతున్న సమయంలో ఇప్పుడు జిన్నింగ్ మిల్లులు పత్తి కొనుగోళ్లను నిలిపేస్తామని చెప్పడం సరిగాదని అభిప్రాయపడ్డారు. జిన్నింగ్ మిల్లర్ల సమస్యలను ఇప్పటికే కేంద్ర జౌళిశాఖ మంత్రి, సిసిఐ ఎండికి లేఖ ద్వారా పంపామని తెలిపారు.

దీనిపై వ్యవసాయ అధికారులను ఢిల్లీకి కేంద్ర అధికారులపై ఒత్తిడి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్యదర్శిని ఆదేశించారు. గతేడాది పత్తి దిగుబడిపై పది శాతం పెరుగుదలను పరిగణనలోకి తీసుకుని పత్తి కొనుగోలు పరిమితిని ఎకరానికి ఏడు క్వింటాళ్లుగా నిర్ణయించామని కేంద్ర జౌళి శాఖ అధికారులు చెబుతున్నారని ప్రస్తావించారు. పత్తి కొనుగోలు పరిమితిని ఎకరానికి 11 క్వింటాళ్ల వరకు పొడిగించాలని కేంద్ర జౌళిశాఖను కోరగా మళ్లీ సరాసరి పత్తి దిగుబడి గణాంకాలు పంపాలని సూచించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు జిల్లావారీగా వాస్తవిక పత్తి దిగుబడి గణాంకాలు పంపాలని ఆదేశించారు.

తెలంగాణ విద్యుత్ సంస్థల్లో వెంటనే ఎన్నికలు నిర్వహించాలి

- లేదంటే అన్ని సంఘాలకు గుర్తింపు హోదా ఇవ్వాలి
- టిజియుఇఇయుహెచ్ 1828 రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వి గోవర్ధన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1989లో ఎపిఎస్ఇబిగా ఉన్న రోజుల్లో తెలంగాణ విద్యుత్ సంస్థల్లో గుర్తింపు ఎన్నికలు జరిగాయి.. కోడ్ ఆఫ్ డిసిప్లిన్ ప్రకారం రెండేళ్లకోసారి గుర్తింపు ఎన్నికలు జరగాల్సి ఉంది.. అయినా 36 ఏళ్లుగా జరగడం లేదు.." అని టిజియుఇఇయు హెచ్ 1828 రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వి గోవర్ధన్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ విద్యుత్ సంస్థల్లో రెగ్యులర్, ఆర్టిజన్ కార్మికుల సమస్యలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ఇపిఎఫ్ టూ జిపిఎఫ్ పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఏళ్ల తరబడి కార్మికులు కోరుతూనే ఉన్నారని గుర్తు చేశారు. 2023లో జెఎల్ఎం ఉద్యోగులకు ఇపిఎఫ్‌పై సీలింగ్, పిఆర్‌సి అమలు కాకపోవడం, సర్వీసులకు తగ్గ నియామకాల్లేక పని భారంతో కార్మికులు సతమతమవుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యలపై ప్రత్యక్ష పోరాటం చేసే సంఘాల్లేకుండా పోయాయని పేర్కొన్నారు. కొన్ని సంఘాలు తామే గుర్తింపు సంఘం అని ప్రకటించుకుని కార్మికుల సమస్యలపై మాత్రం పోరాడటం లేదన్నారు. యాజమాన్యాలు కూడా నచ్చిన వారికి అనధికార గుర్తింపు ఇస్తున్నాయని ఆరోపించారు. కొన్ని సంఘాలు వర్గ దృక్పథాన్ని మరిచి యాజమాన్యం సేవలో పరితపిస్తున్నాయన్నారు. 36 ఏండ్లుగా ఎన్నికల్లేకున్నా.. యాజమాన్యం కొన్ని సంఘాలను మాత్రమే అధికారికంగా చర్చలకు పిలవడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణ విద్యుత్ సంస్థల్లో ఏ యూనియన్లు, ఏ సంఘాలను గుర్తించారో.. అందుకు సంబంధించి జారీ చేసిన టిఒఒలు కావాలని ఆర్‌టిఐ చట్టం ప్రకారం టిజియుఇఇయు (సిఐటియు) అడిగినట్టు తెలిపారు. కానీ యాజమాన్యం కుంటి సాకులు చెప్పి సమాచారం ఇవ్వకుండా దాట వేసిందని, దీని ఆంతర్యమేంటని ప్రశ్నించారు. సింగరేణి, ఆర్‌టిసి, జిహెచ్ఎంసి, కేంద్ర సంస్థ డిఆర్‌డిఒ ఇలా చాలా సంస్థల్లో ఎన్నికలు జరిగాయని, ఈ విధానం విద్యుత్ సంస్థలకు ఎందుకు వర్తించదని ప్రశ్నించారు. గుర్తింపు సంఘం అనే పేరుతో ఆయా యూనియన్ అగ్ర నాయకులు అసలు ఆఫీసుకు వెళ్లకుండానే ఒకటో తారీకు వేతనం తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ మధ్యనే ఒక సంఘం నాయకుడి బండారం బయటపడి తీసుకున్న వేతనం కూడా రికవరీ చేశారని గుర్తు చేశారు.

అరాచకాలు అన్నీ ఇన్ని కావు

కరీంనగర్ సర్కిల్ ఆఫీస్ ప్రాంగణంలో సంస్థ కార్మికులు నివసించడానికి క్వార్టర్లు నిర్మించారని.. కానీ, అవి ఆయా యూనియన్ల ఆక్రమణలో ఉన్నాయని వి గోవర్ధన్ ప్రకటనలో తెలిపారు. ఒక్క యూనియన్‌కు రెండు, మూడు క్వార్టర్లు కూడా ఉన్నాయని, ఇదేమని అడిగితే సమాధానం చెప్పే నాధుడే లేడని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు కార్మికుల ప్రాథమికహక్కులకు భంగం కలిగించినట్టే భావించాలన్నారు. ఇకనైనా ప్రభుత్వం వెంటనే చొరవ చేసి విద్యుత్ సంస్థల్లో ఎన్నికలు జరపాలని, లేదా అన్ని సంఘాలకు గుర్తింపు హోదానైనా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఫ్యాన్సీ నంబర్లు వేలం.. రవాణా శాఖకు ఆదాయం

హైదరాబాద్ బ్యూరో : ఫ్యాన్సీ నంబర్లు రవాణాశాఖకు కాసులు కురిపిస్తున్నాయి. ఒక్కరోజులోనే ఖైరతాబాద్ రవాణాశాఖ కార్యాలయానికి రూ.65,38,889ల ఆదాయం వచ్చినట్లు హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ రమేష్ తెలిపారు. అత్యధికంగా టిజి09 9999 నంబరు రూ.22,72,222లు పలికింది. అతి తక్కువగా టిజి09 0003 నంబరుకు రూ.1,15,121ల ఆదాయం వచ్చింది. టిజి09 9999 నంబరు రూ.22,72,222లకు హనర్ ప్రైమ్ హౌసింగ్ ఎల్ఎల్‌పీ అధినేతలు కైవసం చేసుకున్నారు. టిజి09 0009 .. రూ.6,80,000లకు మెస్సర్స్ దండు ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం దక్కించుకుంది. టిజి09 0006.. రూ.5,70,666లకు సాయి సిల్క్స్ కళామందిర్ లిమిటెడ్ యాజమాన్యం దక్కించుకున్నారు. టిజి09 0099 .. రూ.3,40,000లకు మెస్సర్స్ గోదావరి ఫార్చ్యూన్ సంస్థ దక్కించుకుంది. టిజి09 0001 ... రూ.2,60,000లకు శ్రీనిధి ఐటీ స్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కైవసం చేసుకుంది.

ఎడిబి ప్రతినిధి బృందంతో సిఎస్ భేటీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పలు ప్రాజెక్టులపై ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ప్రతినిధి బృందంతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో చర్చించారు. తెలంగాణ రైజింగ్ 2047 లో భాగంగా హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణ, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లలో మౌలిక సదుపాయాల కల్పన, రాష్ట్రంలో వివిధ మున్సిపాలిటీలు, గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్‌లో సివరేజ్ ప్లాంట్‌ల నిర్మాణం. హ్యాం రోడ్ల విస్తరణ, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ విధానం ద్వారా వ్యవసాయ పంపు సెట్లకు సోలార్ విద్యుత్ అనుసంధానం, టిజిఆర్‌టిసి ఈ-బస్‌లు, యంగ్ ఇండియా స్కిల్, స్పోర్ట్స్ యూనివర్సిటిలలో చేపట్టే ప్రాజెక్టులకు ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్ట్ వివరాలు, ఆర్థిక పరమైన అంశాలపై ఈ సమావేశంలో సమాలోచనలు చేశారు. పరస్పర సహకారంతో నిర్దేశించిన ప్రాజెక్టులను వేగవంతం చేయాలని నిర్ణయించారు. సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ తెలంగాణ పెట్టుబడులకు అనువైనదనీ, దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు.

సమావేశంలో రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, ప్రణాళిక కార్యదర్శి జ్యోతి బుద్ధ ప్రకాష్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి టికె శ్రీదేవి, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, హైదరాబాద్ మెట్రో రైల్ మేనేజింగ్ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, టిజిఐఐసి డైరెక్టర్ శశాంక, హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఇవి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారని సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ఒక ప్రకటన విడుదల చేశారు.

ఐటిఐ ఎంఎఫ్ ఎస్ఐఎఫ్‌లో కొత్త ఎన్ఎఫ్ఒ

ప్రజాశక్తి -హైదరాబాద్

ఐటిఐ మ్యూచువల్ ఫండ్ తన స్పెషలైజ్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (ఎస్ఐఎఫ్) వేదికలో తొలి సారి దివినిటీ ఈక్విటీ లాంగ్ షార్ట్ ఫండ్‌ను విడుదల చేసినట్లు తెలిపింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్ఒ) నవంబర్ 24తో ముగుస్తుందని పేర్కొంది. ఇందులోని నిధులను ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత సాధనాలలో పెట్టుబడి పెట్టడం ద్వారా దీర్ఘకాలిక మూలధన వృద్ధిని అందించనున్నట్లు పేర్కొంది. ఇందులో క్వాలిఫైడ్ ఇన్వెస్టర్లకు కనీస పెట్టుబడి రూ.10 లక్షలుగా నిర్ణయించింది. మార్కెట్ అస్థిరత సమయంలో నష్టాలను తగ్గించాలని చూసే పెట్టుబడిదారులకు ఇది అనుకూలమని ఐటిఐ మ్యూచువల్ ఫండ్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ రాజేష్ బాటియా తెలిపారు.



అభివృద్ధి, సంక్షేమానికే ప్రజల పట్టం

- బిజెపికి జూబ్లీహిల్స్ గట్టి హెచ్చరిక
- మరో పదేళ్లు కాంగ్రెస్‌దే అధికారం : మహేష్ కుమార్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టారని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు.. కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు అంకితమని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లోనూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాపాలన అందిస్తామని వెల్లడించారు. బిసి బిడ్డ నవీన్ యాదవ్‌ను గెలిపించిన ఘనత సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ప్రతి కాంగ్రెస్ కార్యకర్తదని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పనితీరుపట్ల ప్రజలు సంతృప్తిగా ఉండటం వల్లే భారీ మెజార్టీతో విజయం దక్కిందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం కృషిచేసిన సిఎం రేవంత్ రెడ్డికి పార్టీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జూబ్లీహిల్స్ తీర్పుతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లు గెలుస్తుందని ప్రజలు భరోసా కల్పించారని, కనీసం పదేళ్లు అధికారంలో కొనసాగడం తథ్యమన్నారు.బిసిలకు 42శాతం రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ కమిట్‌మెంట్‌తో ఉందన్నారు. బిసి రిజర్వేషన్లకు అడ్డుపడుతున్న బిజెపికి ఈ తీర్పుతో జూబ్లీహిల్స్ ప్రజలు గట్టి హెచ్చరిక పంపారని తెలిపారు. ప్రజలిచ్చిన ఈ తీర్పు ద్వారా బీఆర్ఎస్ పార్టీకి రాష్ట్రంలో స్థానం లేదని మరోసారి రుజువైందని, పార్లమెంట్ ఎన్నికల్లోనే ప్రజలు గుండు సున్నాతో బిఆర్ఎస్ భవిష్యత్తును ఖరారు చేశారని తెలిపారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల మాదిరిగానే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలోనూ కాంగ్రెస్ పార్టీకి ప్రజలు స్పష్టమైన మద్దతు ఇచ్చి ప్రతిపక్షాలకు చెంపపెట్టు వంటి తీర్పు ఇచ్చారని అన్నారు. జూబ్లీహిల్స్ విజయం రానున్న జిహెచ్ఎంసి ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు ప్రొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి, మహ్మద్ షబ్బీర్ అలీ, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, తాహెర్‌బిన్ హందాన్, మానాల మోహన్ రెడ్డి, కేశ వేణు, రత్నాకర్, విపుల్ గౌడ్ పాల్గొన్నారు.

పత్తిరైతుల పట్ల కేంద్రం తీరు దారుణం

- 17 నుంచి 24 వరకు రాష్ట్ర వ్యాప్త ధర్నాలు
- టి సాగర్, సారంపల్లి మల్లారెడ్డి


మీడియాతో మాట్లాడుతున్న టి సాగర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పత్తిరైతుల పట్ల కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, సీనియర్ నేత సారంపల్లి మల్లారెడ్డి విమర్శించారు. రైతులకు అన్యాయం జరుగుతుంటే తెలంగాణ నుంచి గెలిచిన ఎనిమిది మంది బిజెపి ఎంపిలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పత్తి రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 17 నుంచి 24 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేయనున్నట్టు ప్రకటించారు. దేశవ్యాప్త పిలుపులో భాగంగా 26న రాష్ట్రంలో పత్తి రైతుల ప్రదర్శనలు, నిరసనలు ఉంటాయని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. ఎకరాకు కేవలం ఏడు క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేస్తామని సిసిఐ ప్రకటించడం దారుణమని విమర్శించారు. 8-12 శాతం తేమకు మించి ఉంటే కొనుగోలు చేయబోమని, కపాస్ కిసాన్ యాప్ ద్వారా మార్కెట్‌కు పత్తిపంటను తెచ్చే తేదీని స్లాట్ బుక్ చేయాలని నిబంధనలు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. గ్రామాల్లో రైతులు స్మార్ట్ ఫోన్ల పట్ల ఎంత మేర అవగాహన ఉంటుందని ప్రశ్నించారు. వర్షాల వల్ల పత్తిలో 18 శాతం వరకు తేమ వస్తుందని, ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా తేమశాతం 12 శాతం మించి వస్తోందని చెప్పారు. సిసిఐ ఆంక్షలతో పత్తిని కనీస మద్దతు ధరలకన్నా తక్కువ ధరకు వ్యాపారులకు దుస్థితి వస్తోందని వాపోయారు. క్వింటాకు రైతులు రూ. రెండు వేల చొప్పున నష్టపోతున్నారని చెప్పారు. కిసాన్ కపాస్ యాప్‌తో కౌలు రైతులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారన్నారు. సిసిఐతో ప్రయివేటు వ్యాపారులు కుమ్మక్కు అయ్యాయరని, వచ్చిన లాభాన్ని వారు పంచుకుంటున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పత్తిపై 11శాతం దిగుమతి సుంకాన్ని డిసెంబర్ 31 వరకు ఎత్తేయడం వల్ల ఇప్పటికే 40 లక్షల బేళ్లు దిగుమతి అయ్యిందని వివరించారు. దేశంలో 360 లక్షల బేళ్ల పత్తి ఉత్పత్తి జరుగుతుందని, మన దేశ అవసరాలకు 320 లక్షల బేళ్లు పోనూ మిగతా 40 లక్షల బేళ్లను ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్న తీరును వివరించారు. ఇప్పుడు సుంకం రద్దు చేయడంతో మన రైతులు నష్టపోవాల్సి వస్తుందని చెప్పారు. పత్తి పంటపై దిగుమతి సుంకాన్ని 20 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. పత్తి కొనుగోళ్లపై ఆంక్షలు ఎత్తేయాలని కేంద్రానికి వ్యవసాయ శాఖ మంత్రి లేఖలు రాసినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి క్వింటాల్‌కు రూ.475 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు అరిబండి ప్రసాదరావు, శివకుమార్ పాల్గొన్నారు

నాట్కో ఫార్మాకు రూ.518 కోట్ల లాభాలు

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో నాట్కో ఫార్మా లిమిటెడ్ నికర లాభాలు 23.44 శాతం తగ్గి రూ.517.9 కోట్లుగా నమోదయ్యాయి. పరిశోధన, అభివృద్ధి (అర్అండ్‌డి)పై వ్యయాలు పెరగడం, ఉద్యోగుల బోనస్‌లు వల్ల లాభాల్లో తగ్గుదల చోటు చేసుకుందని నాట్కో వెల్లడించింది. ఆ ఔషధ ఉత్పత్తుల కంపెనీ 2024-25 ఇదే సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.676.5 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. ఇదే సమయంలో రూ.1,371.1 కోట్ల రెవెన్యూ ఉండగా.. గడిచిన క్యూ2లో రూ.1,363 కోట్లుగా చోటు చేసుకుంది. మొత్తం వ్యయాలు రూ.849.3 కోట్లకు పెరిగింది. గతేడాది ఇదే క్యూ2లో రూ.616.7 కోట్ల వ్యయాలు నమోదయ్యాయి. ఆర్థిక సంవత్సరం 2025-26కు గాను రెండో సారి మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. రూ.2 ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేర్‌పై రూ.1.50 చెల్లించడానికి నాట్కో బోర్డు ఆమోదం తెలిపింది.

విదేశీ మారకం నిల్వలు 2.7 బిలియన్లు పతనం

ముంబయి : భారతదేశ విదేశీ మారకం నిల్వల్లో ఒక్క వారంలోనే భారీ పతనం చోటు చేసుకుంది. నవంబర్7తో ముగిసిన వారంలో ఏకంగా 2.7 బిలియన్ డాలర్లు తగ్గి687.73 బిలియన్లకు చేరుకున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) శుక్రవారం వెల్లడించింది.ఇది ఇంతక్రితం వారంలోనూ 5.6 బిలియన్ డాలర్లు పతనమై 689.73 బిలియన్లకు పరిమితమయ్యాయి. ఫారెక్స్ నిల్వలలో ప్రధాన భాగం అయినా విదేశీ కరెన్సీ ఆస్తులు నవంబర్7తో ముగిసిన వారంలో 2.45 బిలియన్ డాలర్లు తగ్గి 562.13 బిలియన్లకు తగ్గాయని ఆర్‌బిఐ తెలిపింది. ఈ ఆస్తులలో యూరో, యెన్, పౌండ్ వంటి కరెన్సీలు డాలర్‌తో పోలిస్తే విలువలో హెచ్చు తగ్గులు చెందడం ఈ తగ్గుదలకు కారణం. బంగారం నిల్వలు 1.95 బిలియన్లు తగ్గి 101.53 బిలియన్లుగా ఉన్నాయి. అక్టోబర్‌లో పసిడి నిల్వలు 100 బిలియన్లకు చేరిన విషయం తెలిసిందే. ఐఎంఎఫ్ వద్ద స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డిఆర్) 51 మిలియన్లు తగ్గి 18.59 బిలియన్ డాలర్లకు తగ్గాయని వెల్లడించింది

టెట్ నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్షకు సంబంధించిన టీజీటెట్ -జనవరి,2026 నోటిఫికేషన్ వెలువడింది. శనివారం నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించమన్నారు. దరఖాస్తుల సమర్పణకు ఈ నెల 29 వరకు గడువు. టెట్ పరీక్షలను వచ్చే ఏడాది జనవరి మూడు నుంచి 31 వరకు నిర్వహించనున్నారు. ఒక్కో పేపర్ ఫీజు రూ.750 చొప్పున నిర్ణయించారు. రెండు పేపర్లు రాయాలనుకునే వారు రూ.1000 చెల్లించాల్సి ఉంటుంది. 2026 టెట్ నోటిఫికేషన్‌కు సంబంధించిన ఇన్ఫర్మేషన్ బులెటిన్‌ను పాఠశాల విద్య శాఖ శుక్రవారం జారీ చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు టెట్‌లో అర్హత సాధించాలని సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో అందుకు సంబంధించిన సవరణలతో నోటిఫికేషన్ జారీ చేశారు. డిసెంబర్ 27 నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. పరీక్షలను ఉదయం సెషన్ తొమ్మిది గంటల నుంచి 11:30 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్ రెండు గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి పది నుంచి 16 మధ్యలో టెట్ ఫలితాలను విడుదల చేయనున్నారు. ఇప్పటికే సర్వీస్‌లో ఉండి టెట్ ఉత్తీర్ణులు కానీ ఉపాధ్యాయులు 2027 నాటికి పాస్ కావాలనీ, లేనిపక్షంలో ఉద్యోగం వదులుకోవాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన విషయం తెలిసిందే.

అక్రమ పద్ధతుల్లో బీహార్‌లో ఎన్‌డిఎ కూటమి గెలుపు

- రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న బిజెపి
- బిసిల రిజర్వేషన్‌తోనే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయం
- ఫార్మాలో ఉన్న భూములపై నిషేధం ఎత్తివేయాలి : జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



కార్యక్రమంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

దేశంలో బిజెపి రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నదని, ఆ విధంగానే అక్రమ పద్ధతుల్లో బీహార్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయం సాధించిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా యాచారం మండలం గున్‌గల్‌లో నిర్వహించిన పార్టీ రంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీహార్‌లో బిజెపికి వ్యతిరేకంగా ఉన్న లక్షల ఓట్లను తొలగించిందని, ఆ రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న ఆర్జేడీ, అదేవిధంగా లెఫ్ట్ పార్టీలు పదేపదే చెప్పాయని గుర్తు చేశారు. ఆ విధంగానే బీహార్‌లో ఎన్నికల ఫలితాలు వచ్చాయని తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి.. రాజ్యాంగ వ్యవస్థలైన సీబీఐ, ఈడీ, ఈసీలను నిర్వీర్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు అనుగుణంగా ప్రజలు చైతన్యమై పోరాడాలని కోరారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న బిసిల రిజర్వేషన్‌తోనే విజయం సాధించిందని అన్నారు. ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీల హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రైతులు పండించిన పత్తి పంటను షరతులు లేకుండా కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. పండించిన పత్తి పంటకు మద్దతు ధర లభించేలా అధికారులు దృష్టిపెట్టాలని తెలిపారు. సిసిఎల్ సెంటర్లను వెంటనే ప్రారంభించి వడ్లని కొనుగోలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కిసాన్ యాప్‌తోనే రైతులకు సమస్యలను తెచ్చిపెట్టిందని అన్నారు. యాచారం మండల పరిధిలోని ఫార్మా బాధిత గ్రామాలైన మేడిపల్లి, నానక్ నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో నిషేధిత జాబితాలో ఉన్న రైతు పేర్లను వెంటనే తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రైతులందరికీ ప్రభుత్వం నుంచి అందే ప్రోత్సాహకాలు పొందేలా చూడాలని అన్నారు. మొండిగౌరెల్లి గ్రామ రెవెన్యూకు సంబంధించి 127, 68, 19 సర్వే నెంబర్లలో ఉన్న భూములకు బహిరంగ మార్కెట్ కంటే మూడింతలు ఎక్కువ పరిహారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో సిపిఎం రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమాలను నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి సామెల్, డి రామచంద్, కె భాస్కర్, డి జగదీష్, ఇ నర్సింహ, కె జగన్, చంద్రమోహన్, కవిత, జిల్లా కమిటీ సభ్యులు అలంపల్లి నరసింహ, సిహెచ్ జంగయ్య, రావుల జంగయ్య, అంజయ్య, జగన్, మండల కమిటీ సభ్యులు శాఖ కార్యదర్శి ప్రజా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీ బోధన నుంచి పోషకాహారం వరకు ప్రభుత్వానిదే బాధ్యత

- 18న మహిళా విధాన రూపకల్పనపై సమావేశం : మంత్రి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల ప్రి ప్రైమరీ బోధన నుంచి పోషకాహారం వరకు సంపూర్ణ బాధ్యత ప్రభుత్వానిదేనని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులతో కలిసి బెలూన్లు ఎగురవేసి వేడుకలను ఆమె ప్రారంభించారు. చిన్నారులకు బిస్కెట్ ప్యాకెట్లు స్వయంగా అందించి, వారిని ప్రేమగా చేరదీసి సందర్భం అక్కడి వాతావరణాన్ని మరింత ఉల్లాసభరితంగా మార్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశం కోసం జీవితాన్ని అర్పించిన తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఆలోచనలు, నైతిక విలువలు నేటి తరానికి మార్గదర్శకాలని తెలిపారు. మహిళల సంక్షేమం కోసం నూతన విధానాన్ని రూపొందించే క్రమంలో నిపుణులు, మేధావులతో ఈ నెల 18న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు మంత్రి వివరించారు. అనంతరం చిన్నారుల ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆసక్తిగా వీక్షించి వారి ప్రతిభను మెచ్చుకున్నారు. శిశువిహార్‌తో పాటు వివిధ అనాథాశ్రమాల్లో ఉంటూ చదువులో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద, బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి, సభ్యులు కన్నుర్ల వందన గౌడ్, మరిపల్లి చందన, బండి అపర్ణ, గోగుల సరిత, ప్రేమలత అగర్వాల్, బి.వచన్‌కుమార్, మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయంతో టిజెఎస్ కార్యాలయంలో సంబరాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లిహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం సాధించడంతో టిజెఎస్ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు సంబురాలు జరుపుకున్నారు. మిఠాయిలు పంచుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈ సందర్భంగా టిజెఎస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం నవీన్ యాదవ్ విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నగరంలోని బస్తీల్లో సమస్యల పరిష్కారానికి టిజెఎస్ నాయకులు, కార్యకర్తలపై మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు. నగరంలో టిజెఎస్ బలోపేతానికి ప్రణాళికలు రూపొందించాలని నగర కమిటీని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పల్లె వినయ్ కుమార్ , రమేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

ఫలితాలను సమీక్షించుకుంటాం.. ఆత్మపరిశీలన చేసుకుంటాం

- ప్రజాసమస్యలపై పోరాటం చేస్తాం : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



'రాజకీయాల్లో గెలుపోటములు సహజం. ముందుకు పోదాం, కార్యకర్తలు సన్నద్ధం కావాలి. మరింత బలంగా పనిచేద్దాం. కెసిఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయ్యే వరకూ శ్రమిద్దాం' అని అన్నారు భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ తన సమీప ప్రత్యర్థి బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై సుమారు 25 వేల ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఈ సందర్భంగా కెటిఆర్ శుక్రవారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ ఉప ఎన్నిక పార్టీకి కొత్త ఉత్సాహాన్ని, బలాన్ని ఇచ్చిందని రాష్ట్రంలో రాజకీయ ప్రత్యామ్నాయం మాత్రమేనని ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని అన్నారు. ఇకపైనా ప్రజా సమస్యలపై తమ పార్టీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

"వ్యక్తిగత సమస్యలు ఉన్నా, పార్టీ నాయకులు జూబ్లీహిల్స్ ఎన్నికల్లో విజయం కోసం నిర్విరామంగా పనిచేశారు. వారికి పేరు పేరునా ధన్యవాదాలు. ప్రతి బూత్‌లో స్థానిక నాయకత్వం బాగా పనిచేసింది. మాగంటి సునీతకు రాజకీయ అనుభవం లేకపోయినా ఆమె ఎంతో కష్టపడ్డారు. ఒక రకంగా పోరాటమే చేశారు. గత రెండేళ్లుగా ప్రధాన ప్రతిపక్ష పార్టీగా బిఆర్ఎస్ అద్భుతమైన పాత్ర పోషిస్తోంది. ప్రజా సమస్యలు కేంద్రంగా కొట్లాడుతున్నాం. ఈ ఎన్నికల్లో మాకు ఓటు వేసిన ప్రతి ఓటరుకు ధన్యవాదాలు. అటు ప్రజాక్షేత్రం, ఇటు సోషల్‌మీడియాలోనూ మేము పనిచేస్తున్నాం. ఈ ఉప ఎన్నికలో నిజాయతీగా కొట్లాడాం. ఎన్నికలు ఎలా జరిగాయో అందరికీ తెలుసు. వాటి గురించి నేను మాట్లాడను. ప్రచారం ముగిసే వరకూ ఒకరకంగా.. ముగిశాక మరో రకంగా జరిగాయి.

2014-23 మధ్య ఏడు ఉప ఎన్నికలు జరిగాయి. అప్పటి ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ ఒక్క ఉప ఎన్నికలోనూ గెలవలేదు. మేము ఐదు గెలిచాం. రెండింటిలో ఓడిపోయాం. జిహెచ్ఎంసి ఎన్నికలు వస్తే కూడా ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఒకట్రెండు కార్పొరేట్ సీట్లు మాత్రమే వచ్చాయి. ఈ ఎన్నికల్లో ప్రజల తరఫున వాదనను బలంగా వినిపించగలిగాం. ప్రజా సమస్యలు, ఆరు గ్యారెంటీల అమలు వైఫల్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాం. కుల, మత రాజకీయాలు, అసభ్య పదజాలం ఉపయోగించలేదు. చాలా హుందాగా పోరాటం చేశాం. ప్రజలకు అవసరమైన పాయింట్లు మాత్రమే చర్చకు పెట్టాం. కాంగ్రెస్, బిజెపి ఎన్ని రకాలుగా కవ్వించే ప్రయత్నం చేసినా సంయమనం పాటించాం. పదేళ్ల ప్రభుత్వం నడిపిన ఒక జవాబుదారీ పార్టీగా జూబ్లీహిల్స్‌కు ఏం చేశారంటే. రూ.ఐదు వేల కోట్లతో అభివృద్ధి పనులు చేశాం.

జాతీయ స్థాయిలో చూస్తే బిహార్‌లో కాంగ్రెస్ ఉనికి కోల్పోయే పరిస్థితి వచ్చింది. ఈ ఎన్నిక భారత రాష్ట్ర సమితికి చిన్న సెట్ బ్యాక్ మాత్రమే. ఫలితాలను సమీక్షించుకుంటాం. ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన అవసరం కూడా ఉంది. అధికార పార్టీ ఎన్ని ప్రలోభాలు పెట్టినా దీటుగా ఎదుర్కొని మంచి ఓటింగ్ సాధించాం. ఒక పార్టీ డిపాజిట్ కోల్పోయే పరిస్థితి వచ్చింది. దొంగ ఓట్ల గురించి స్పష్టమైన ఆధారాలు ఇచ్చాం. పోలింగ్ రోజు మా అభ్యర్థి పట్టుకున్నారు. ఎన్నికల కమిషన్, పోలీసులు సమాధానం చెప్పాలి. ఓటమికి సాకులు వెతకడం లేదు. చర్చ జరగాలని కోరుకుంటున్నాం. ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయమై బెంగాల్‌లో హైకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చింది. రాష్ట్రంలో కూడా పది చోట్ల ఉపఎన్నికలు రావాల్సిందే. ఒక్క ఉప ఎన్నికకే కాంగ్రెస్ ఇన్ని ఆపసోపాలు పడింది. పది చోట్ల ఉపఎన్నికలు జరిగితే సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీలను తీసుకొస్తారేమో" అని కెటిఆర్ అన్నారు.

ట్రిబుల్ ఆర్ భూ నిర్వాసితులకు న్యాయం జరిగేలా చూస్తా..

- భూ నిర్వాసితులకు మార్కెట్ ధర చెల్లించాలి : కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రీజినల్ రింగ్ రోడ్‌లో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులకు న్యాయం జరిగేలా చూస్తానని జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. శుక్రవారం నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామంలో రీజినల్ రింగ్ రోడ్‌లో భూములు కోల్పోయిన రైతులతో ఆమె ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం రీజినల్ రింగ్ రోడ్‌లో భూములు కోల్పోయిన రైతులకు మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం చెల్లిస్తామని లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వాలని అన్నారు. గత ప్రభుత్వంలో, ప్రస్తుత ప్రభుత్వంలో భూములు కోల్పోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కొందరు భూస్వాముల భూములను కాపాడేందుకు గత ప్రభుత్వంలో రీజనల్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్‌ను మార్చిందని అన్నారు. దాంతో అనేకమంది పేద రైతులు భూములు, కళాకారుల ఇండ్లు కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రీజినల్ రింగ్ రోడ్‌లో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం జరిగేంతవరకు వారి పక్షాన నిలబడి పోరాటం చేస్తానని తెలిపారు. అనంతరం అసంపూర్తిగా నిలిచిపోయిన కాళేశ్వరం ప్రాజెక్టు పనులను ఆమె సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జాగృతి నాయకులు పాల్గొన్నారు.

చేనేత అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

- సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

చేనేత రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో చేనేత జౌళి శాఖ కమిషనర్ శైలజ రామయ్యర్‌ను తెలంగాణ చేనేత కార్మిక సంఘం నాయకులతో కలిశారు. రాష్ట్రంలోని చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర సర్కారు ఇచ్చిన హామీ మేరకు నేతన్నలను రుణ విముక్తులను చేయాలని నెల్లికంటి సత్యం కోరారు. చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో 527 చేనేత సహకార సంఘాలున్నాయనీ, టెస్కో కొనుగోలు చేసిన వస్త్రాలకు సకాలంలో డబ్బులు చెల్లించకపోవడంతో వడ్డీల భారం పెరిగి చేనేత సహకార సంఘాలు అప్పుల్లో కూరుకుపోయాయని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. సంఘాలు మూతపడటంతో కార్మికులకు ఉపాధి దొరకని పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. చేనేత సహకార సంఘాల రుణాలన్నింటినీ మాఫీ చేసి బ్యాంకుల ద్వారా కొత్త రుణ సహాయం అందించాలనీ, మూతబడిన సంఘాలన్నింటినీ తెరిపించాలని విన్నవించారు.

రుణమాఫీ జాప్యం.. చేనేతకు వ్యథ

- సర్కార్ హామీకి దక్కని భరోసా - వడ్డీలు కట్టలేక ఇక్కట్లు
- నిర్లక్ష్యం వహిస్తే లబ్ధిదారులకు నష్టం
- షరతులతో తగ్గిన అర్హుల జాబితా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సాంచాల చప్పుళ్లతో కలకలలాడే నేతన్నలు..ఇప్పుడు అప్పుల బాధలతో వేదన పడుతున్నారు. రంగురంగుల చీరలు నేసే ఆ మగ్గాలు..బ్యాంకు, ప్రయివేటు అప్పులు తీర్చలేక ఇబ్బందులకు గురవుతున్నారు. రాట్నాలు ఒడికే ఆ చేతులు.. సర్కార్ హామీలో భాగమైన రుణ మాఫీ కోసం ఆశగా ఎదురు చూస్తున్నాయి. ఇది రాష్ట్ర వ్యాప్తంగా చేనేత రంగంపై ఆధారపడి బతుకు వెళ్లదీస్తున్న నేతన్నల దుస్థితి..

రాష్ట్రంలోని వేలాదిమంది చేనేత కార్మికులు ప్రత్యక్షంగానో పరోక్షంగానో చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రభుత్వం చేనేత కార్మికులకు రూ.లక్షలోపు రుణమాఫీ చేస్తామని హామీనిచ్చింది. ఆ హామీ అమలులో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో వడ్డీ భారం పెరుగుతోందని కార్మికులు వాపోతున్నారు. రూ.లక్షకు పైగా రుణం తీసుకున్న వారు ఆపై మొత్తాన్ని జూలై నెలాఖరులోగా చెల్లిస్తే వారందరికీ రుణమాఫీ అవుతుందని అధికారులు చెప్పడంతో చాలామంది అప్పు తెచ్చి రుణం చెల్లించారు. రుణమాఫీ అమలు కాకపోవడంతో కార్మికుల ఖాతాలోంచి మూడు నెలల వడ్డీని కట్ చేసుకున్నారు. మరోవైపు బయట తెచ్చిన అప్పులకు వడ్డీ చెల్లిస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు.

జిఒ జారీ.. అయినా జాప్యం

గతేడాది సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో జాతీయ చేనేత సాంకేతిక సంస్థ (ఎన్ఐహెచ్‌టి) ప్రారంభోత్సవం సందర్భంగా చేనేత కార్మికులకు రూ.లక్ష లోపు రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ప్రభుత్వం రుణమాఫీకి సంబంధించిన జిఒ 56ను జారీ చేసింది. 2025-26 బడ్జెట్ నుంచి 33 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే 14 నెలలు గడిచినా చేనేత రుణమాఫీ అమలుకు నోచుకోలేదు.

లబ్దిదారుల ఎంపికపై అసంతృప్తి..

2017 ఏప్రిల్ 1నుంచి మార్చి 31 2024 మధ్యలో రుణం తీసుకున్న వారికి మాత్రమే రుణమాఫీ వర్తిస్తుంది. 2016లో గానీ, 2024 ఏప్రిల్ తర్వాత తీసుకున్న రుణాలు పరిగణనలోనికి రావు. అయితే బ్యాంకు రుణమే తప్ప..ఇతర కో-ఆపరేటీవ్ రుణాలకు ఇది వర్తించదు.అయితే షరతులు ఎక్కువగా ఉండటం,పథకానికి అర్హత నిరూపించేందుకు అనేక డాక్యుమెంట్లు, పత్రాలు అవసరం. గ్రామీణ చేనేత కార్మికునికి ఈ డాక్యుమెంట్లను పొందటం కష్టంగా మారింది. ఇంకొన్ని షరతుల మూలంగా లబ్దిదారుల సంఖ్య తగ్గిపోయిందని తెలుస్తున్నది. ఉత్పత్తి కొనసాగుతున్నట్టు పత్రాలు, ఆధార్, బ్యాంకు అకౌంట్, జిఎస్‌టి నమోదు తదితర పత్రాలు ఉంటేనే రుణ మాఫీ వర్తిస్తుందని అధికారులు చెప్పటంతో చాలా మంది చేనేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో పక్క చిన్న వ్యక్తి గత రుణాలు తీసుకుని చితికిపోయిన కార్మికుల ఆవేదన వర్ణనాతీతం.

తిరస్కరించిన దరఖాస్తులే ఎక్కువ..

రాష్ట్రంలో చేనేత కార్మికుల సంఖ్య 2,12 వేలు (2013 అంచనా).మొత్తం రుణ గ్రహీతల సంఖ్య32,476.రుణమాఫీకి ప్రభుత్వం కేటాయించిన మొత్తం రూ.33కోట్లు. అంటే లబ్దిదారులకు సగటు మాఫీ రూ. 10,200 మాత్రమే. మొత్తంగా లబ్దిదారులు 28శాతం మాత్రమే ఉంది. ఇందులో తిరస్కరించిన దరఖాస్తులు సగానికి మించి ఉండటం విషేశం. సిరిసిల్లా జిల్లాలో మొత్తం అందిన దరఖాస్తులు 6,245 కాగా..అందులో అంగీకరించినవి కేవలం 2,312 మాత్రమే. తిరస్కరణకు గురైనవి 3,933 ఉన్నాయి. గద్వాల జిల్లాలో మొత్తం దరఖాస్తులు 3,110కాగా, అందులో అంగీకరించినవి 1,225 మాత్రమే. తిరస్కరించినవి 1, 885. వరంగల్ జిల్లాలో మొత్తం దరఖాస్తులు 5,320కాగా, అంగీకరించినవి 2,998. తిరస్కరించినవి 2,322. నల్లగొండ జిల్లాలో మొత్తం దరఖాస్తులు 4,789 కాగా,లబ్దిదారుల సంఖ్య 2,308మంది ఉన్నారు. తిరస్కరించిన దరఖాస్తులను మరో సారి పరిశీలించి, రుణ విముక్తి చేయాల్సిన అవసరం ఉందని లబ్దిదారులు కోరుతున్నారు. లబ్దిదారులకు తక్షణమే రుణమాఫీ చేయాలి. రకరకాల కారణాలతో మరింత జాప్యం చేయొద్దని కోరుతున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం..

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత పరిశ్రమను నిర్లక్ష్యం చేస్తున్నది. కార్మికుల సమస్యలను గాలికి వదిలేసింది. చేనేత పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న వేలాది కుటుంబాలను వీధిపాలు చేసింది. సిఎం రుణ మాఫీ ప్రకటించి ఏడాది దాటినా నేటి వరకు అమలు చేయలేదు. రుణాలు ఇచ్చిన బ్యాంకులు ఒత్తిడి తెస్తున్నాయి.మిత్తీలు పెరిగిపోతున్నాయి. తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించాలి

- వనం శాంతికుమార్, రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ చేనేత కార్మిక సంఘం

ర్యాగింగ్‌కు తావు లేదు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ త్రిపాఠి

- నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యాసంస్థల్లో ర్యాగింగ్ భూతానికి తావు లేదని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. నల్లగొండ ప్రభుత్వ వైద్య కళాశాల ర్యాగింగ్ వ్యతిరేక జిల్లా స్థాయి కమిటీ శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠి అధ్యక్షతన సమావేశమైంది.

ఇటీవల ప్రభుత్వ వైద్య కళాశాలలో జరిగిన ర్యాగింగ్ ఘటనలపై చర్చించారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో ఎస్పి శరత్ చంద్రపవార్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ జె.సత్యనారాయణ, ఇన్‌చార్జి డిఆర్‌ఒ వై అశోక్ రెడ్డి, డిఎస్పి శివరాంరెడ్డి, ప్రభుత్వ వైద్య కళాశాల అదనపు ప్రిన్సిపల్ ఆర్ రాధాకృష్ణ, సామాజిక కార్యకర్త సురేస్ గుప్తా, ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణకుమారి, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగ్గురు సైబర్ నేరగాళ్ల అరెస్ట్

- ఉద్యోగాల ఆశ చూపి రూ.ఆరు లక్షలు చోరీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పి కాంతిలాల్

ఉద్యోగాల ఆశ చూపి రూ.ఆరు లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లను ఆసిఫాబాద్ జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగజ్‌నగర్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఎస్పి కాంతిలాల్ పాటిల్ వివరాలు వెల్లడించారు. తనకు ఉద్యోగం ఆశ కల్పించి వాట్సప్ లింక్ ద్వారా గుర్తుతెలియని వ్యక్తులు తన వద్ద రూ.6 లక్షలు కాజేశారంటూ కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన గద్దల కిరణ్‌కుమార్ ఆగస్టు 19న టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు దీని సూత్రధారి గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో ఉన్నట్టు గుర్తించారు. టౌన్ ఎస్ఐ ప్రశాంత్‌తోపాటు ప్రత్యేక పోలీసు బృందం అక్కడికి వెళ్లి విచారణ చేపట్టింది. ఇందులో ముగ్గురు నిందితులు ఉన్నట్టు గుర్తించారు. అహ్మదాబాద్‌కు చెందిన కడవల భవేష్ సీదా భాయ్‌కి చెందిన ఐడిఎఫ్‌బి బ్యాంక్ ఖాతాలో డబ్బులు జమ కాగా.. అతన్ని అదుపులోకి తీసుకొని విచారించారు. రాథోడ్ రాహుల్ తన చేత ఖాతా తెరిపించాడని, అతనే బ్యాంక్ లావాదేవీలు నిర్వహిస్తూ ప్రతి లావాదేవికీ తనకు కమీషన్ కింద రూ.3వేలు ఇచ్చేవాడని భవేష్ తెలిపాడు. ఈ విధంగా మొత్తం రూ.1,32,000 తన ఖాతా నుంచి రాహుల్‌కు ఇచ్చినట్టు చెప్పాడు. వెంటనే పోలీసులు రాథోడ్ రాహుల్ హాజబాయ్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా తాను సాహు ప్రదీప్ అనే వ్యక్తి సూచన మేరకు భవేష్‌తో ఖాతా తెరిపించానని, ఇందుకోసం తాను కమీషన్‌గా రూ.9 వేలు తీసుకున్నట్టు ఒప్పుకున్నాడు. భవేష్ ఖాతాలో జమ అయిన మొత్తాన్ని చెక్కు ద్వారా డ్రా చేసి సాహు ప్రదీప్‌కు అందించినట్టు తెలుపగా.. పోలీసులు సాహు ప్రదీప్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. అభిషేక్ పాటిల్ అనే వ్యక్తి సూచన మేరకు తాను బ్యాంక్ ఖాతాలు తెరిపించి వాటి ద్వారా జరిగే లావాదేవీలపై కమీషన్ పొందుతున్నట్టు సాహు ప్రదీప్ ఒప్పుకున్నాడు. ఈ ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. పరారీలో ఉన్న అభిషేక్ పాటిల్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

భవేష్‌కు మహారాష్ట్ర, తమిళనాడులో కూడా బ్యాంక్ ఖాతాలు ఉన్నట్టు పోలీసుల విచారణలో తేలింది. అభిషేక్ పాటిల్ పట్టుబడితే కేసు కొలిక్కి వచ్చే అవకాశముంది. ప్రస్తుతం పట్టుబడి ముగ్గురు నిందితులు కూడా అహ్మదాబాద్‌కు చెందిన వారే. ఇందులో సాహు ప్రదీప్ గ్రాడ్యుయేట్ పూర్తి చేసుకొని ఎంబిఎ చదువుతుండగా, భవేష్ సీదా బాయ్ టైలరింగ్, రాథోడ్ రాహుల్ కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారని ఎస్పి తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో కాగజ్‌నగర్ డిఎస్పి వహీదుద్దీన్, కాగజ్‌నగర్ టౌన్ సిఐ ప్రేంకుమార్, టాస్క్‌ఫోర్స్ సిఐ రాణా ప్రతాప్, సిఐ రవీందర్, ఎస్ఐ తేజస్విని, టౌన్ ఎస్ఐ యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

బిఆర్ఎస్‌లో నైరాశ్యం...

- వెంటాడుతున్న వరుస ఓటములు
- సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోలేకపోయిన గులాబీ దళం
- అసెంబ్లీ ఎన్నికల నుంచి ఇదే పరిస్థితి
- జూబ్లీహిల్స్‌లో ఫలితమివ్వని కెటిఆర్ ఒంటరిపోరాటం
- ప్రచారానికి కెసిఆర్ దూరం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలను బిఆర్ఎస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు అహర్నిశలు శక్తివంచన లేకుండా పనిచేసింది. ఎలాగైనా గెలవాలని అవిశ్రాంతంగా కృషి చేసింది. కానీ అధికార పార్టీ ఎత్తుల ముందు ప్రధాన ప్రతిపక్షం చతికిలపడింది. ఈ ఎన్నికల్లోనూ బిఆర్ఎస్ ఘోర పరజయాన్ని చవిచూసింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ 98,988 (50.83 శాతం) ఓట్లు, బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపినాథ్ 74,259 (38.13 శాతం) ఓట్లు సాధించారు. బిఆర్ఎస్‌పై కాంగ్రెస్ అభ్యర్థి 24,729 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అసెంబ్లీ ఎన్నికల నుంచి బిఆర్ఎస్ వరుసగా అన్ని ఎన్నికల్లోనూ ఓడిపోతోంది. పార్లమెంటు ఎన్నికల్లో ఓట్లు తగ్గడంతోపాటు ఒక్క సీటునూ గెలవలేకపోయింది. 2024 జూన్‌లో కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్ గెలిచారు. అక్కడ బిజెపి రెండో స్థానంలో ఉంటే బిఆర్ఎస్ మూడో స్థానంతో సరిపెట్టుకుంది. వరుస ఓటములతో బిఆర్ఎస్ శ్రేణులు నైరాశ్యంలో పడ్డాయి. ఇప్పుడు జూబ్లీహిల్స్ ఫలితంతో కుంగిపోయాయి. అధికార పార్టీతో సమానంగా కష్టపడినా ఫలితం అనుకూలంగా ఎందుకు రాలేదనే చర్చ జరుగుతుంది.

కెసిఆర్ ప్రచారానికి రానిచోట బిఆర్ఎస్ ఓటమి

బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారానికి రాకపోవడంపై పెద్దఎత్తున చర్చ జరిగింది. ప్రచారానికి రాకపోయినా బిఆర్ఎస్‌ను ఆదరించాలని, మాగంటి సునీతను గెలిపించాలని కోరుతూ ఓటర్లకు బహిరంగ లేఖను కూడా విడుదల చేయలేదు. సిఎం రేవంత్‌రెడ్డి ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుని అధికార పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం కృషి చేశారు. కానీ కెసిఆర్ ఒక్క రోజు కూడా ప్రచారానికి రాకపోవడం ఓటర్లపై ప్రభావం చూపిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇంకోవైపు ముఖ్యమంత్రిగా కెసిఆర్ ఉన్నపుడు కూడా దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల ప్రచారానికి వెళ్లలేదు. అంటే కెసిఆర్ ప్రచారం చేయని చోట బిఆర్ఎస్ ఓటమి పాలవుతుంది.

ఓటమికి ఎన్నో కారణాలు...

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ ఓటమికి చాలా కారణాలున్నాయి. ఇక తండ్రి మరణంతో ట్రబుల్ షూటర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు కూడా కీలక సమయంలో ఇంటికే పరిమితం కావాల్సి వచ్చింది. చివరి మూడు రోజులు మాత్రమే ఆయన ప్రచారం చేశారు. బిఆర్ఎస్ నుంచి కల్వకుంట్ల కవిత బహిష్కరణకు గురికావడం కూడా చర్చనీయాంశమయ్యాయి. కుటుంబ సమస్య కూడా బిఆర్ఎస్ ఓటమిపై ప్రభావం చూపింది. ఇక బిఆర్ఎస్ నుంచి పోటీ చేసిన అభ్యర్థి మాగంటి సునీత మహిళ కావడం, ఎక్కువ సమయాన్ని ప్రజలకు వెచ్చించే అవకాశం లేదనే అభిప్రాయం కూడా వినిపించింది. అన్నింటికీ మించి అధికార పార్టీ గెలిస్తే అభివృద్ధి జరుగుతుందని, బిఆర్ఎస్ గెలిస్తే అభివృద్ధి ఆగిపోతుందని ప్రజలు భావించారు.

ప్రభావం చూపని బిఆర్ఎస్ ప్రచారం

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ భుజస్కంధాలపై జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలను వేసుకుని ప్రచారం చేశారు. రోడ్‌షోలు నిర్వహించారు. ప్రజలు భారీగానే హాజరయ్యారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలు, వాటిని అమలు చేయకపోవడం వల్ల ప్రజల ఇబ్బందుల గురించి ఎల్ఈడీ స్క్రీన్లపై వినూత్న ప్రచారం చేశారు. ఆరు గ్యారంటీల్లో అమలు కాని ఒక్కో పథకం వల్ల ప్రజలు ఎంత నష్టపోయారో వివరిస్తూ బాకీ కార్డు గురించి ఇంటింటికీ వివరించారు. హైడ్రా కూల్చివేసిన ఇండ్ల వల్ల సామాన్యులు, పేద ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడ్డారో చూపించారు. అధికార పార్టీకి చెందిన మంత్రులు, ఇతర నాయకులకు హైడ్రా అండగా నిలబడిన విషయాన్ని చెప్పారు. రెండేండ్లలో రేవంత్‌రెడ్డి చేసిన అభివృద్ధిని చెప్పి ఓట్లు అడగాలని సవాల్ విసిరారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో డివిజన్ల వారీగా బీఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లకు బాధ్యతలను అప్పగించారు. పోల్ మేనేజ్‌మెంట్ కూడా బాగానే చేశారు. కానీ బీఆర్ఎస్ నేతల ప్రచారం ఓటర్లను ఆకట్టుకోలేదు. బిఆర్ఎస్‌కు ఓటు పడేలా ప్రభావితం చేయలేదు. అధికార పార్టీ ప్రలోభాల ముందు బిఆర్ఎస్ నిలబడలేకపోయింది. డబ్బు, మద్యం, చీరలు, గ్రైండర్లు, మిక్సీలు కాంగ్రెస్ నేతలు పంచిందంటూ ఇసి, పోలీసుల దృష్టికి బిఆర్ఎస్ నాయకులు ఎప్పటికప్పుడు తెచ్చారు. ఇంకోవైపు అధికార పార్టీ ఇచ్చిన డబ్బులను తీసుకుని బీఆర్ఎస్‌కు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. కానీ ప్రజలు దాన్ని సమర్థించలేదు. అధికార పార్టీకే అండగా నిలబడ్డారు.

బిఆర్ఎస్ భవిష్యత్ ప్రశ్నార్థకం ?

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచిన కాంగ్రెస్ స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నది. వచ్చేఏడాది ఫిబ్రవరిలో జిహెచ్ఎంసి పాలక మండలి పదవీకాలం ముగుస్తుంది. మున్సిపాల్టీలు, మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికలు కూడా రాబోతున్నాయి. అంటే రాబోయే కాలంలో వరుస ఎన్నికలు ఉండబోతున్నాయి. వరుస గెలుపులతో కాంగ్రెస్ జోరుమీద ఉన్నది. అసెంబ్లీ ఎన్నికల నుంచి వరుస ఓటములతో బిఆర్ఎస్ పార్టీ నైరాశ్యంలో ఉన్నది. దీంతో ప్రధాన ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ భవిష్యత్ ఏంటన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. స్థానిక సంస్థల ఎన్నికలు, జిహెచ్ఎంసి ఎన్నికలను ఎలా ఎదుర్కొంటుంది, పార్టీ శ్రేణులకు ఎలాంటి దిశానిర్దేశం చేస్తుంది, గెలుపుపై ఎలాంటి వ్యూహాలను రచిస్తుందనేది వేచిచూడాలి.